# అనేకత్వములోని ఏకత్వమును నిరూపింప జేయునదే సంస్కృతి

విద్యానామ నరస్యరూప మధికమ్ ప్రచ్ఛన్న గుప్తం ధనమ్
విద్యా భోగకరీ యశస్సుఖకరీ విద్యా గురూణాం గురుః
విద్యా బన్ధుజనో విదేశ గమనే విద్యా పరాదేవతా
విద్యా రాజ సుపూజ్యతే నహిధనం విద్యా విహీనః పశుః

ప్రేమ స్వరూపులైన విద్యార్థులారా! విద్యాబోధకులారా! విద్యాభిమానులారా!

విద్యయే మానవునకు సౌందర్యము. విద్యయే మానవునకు గుప్తధనము. విద్యయే భోగము. విద్య గురువులందరికంటె గొప్పగురువు. విదేశయాత్ర సలిపినప్పుడు విద్య మనకు గొప్ప బంధువువలె తోడ్పడుతుంది. విద్య మరొక నేత్రము, దృష్టి. రాజులచేత పూజింపబడేది విద్యకాని, ధనము కాదు. ఇట్టి పవిత్రమైన, దివ్యమైన విద్యకు నోచుకోలేనివాడు పశువుతో సమానము.

సత్యామృతంబును చవిచూడకున్నచో
చెల్లునే తానొక్క కల్లబొమ్మ
ధర్మంబు నెరుగక దనుజుండు యగుగాని
మానవుండెట్లగును మహితవృత్తి
శాంతి పొందనివాడు శార్దూలమేగాని
మానవుడెట్లగు మనసు లేక
ప్రేమలేని నరుడు బీటలు వారిన
మరుభూమియేగాని మనుజుడగున

కాన నాలుగు గుణములు క్రమము తప్ప

sri sathyasai vacharamrutam

**పట్టుదలతోడ సాధింప పరమ విద్య**
**ఇంతకన్నను ఘనవిద్య యేమికలదు**
**సాధు సద్గుణ గణ్యులౌ సభ్యులారా**

**ప్రేమస్వరూపులారా!**

స్థూలజగత్తుకు, జీవలోకమునకు, మానసిక సీమకు, సాంఘిక జీవితానికి మూలమై, ఆధారమైవున్న సత్యమునకు ప్రత్యక్ష స్వరూపమే విద్య. మన నిత్య జీవితములో ఎదురయ్యే సమస్యలను, సవాళ్లను ఎదుర్కొనే మానసిక ధైర్యస్థైర్యములు, శక్తిని చేకూర్చునదే విద్య. సృష్టియొక్క రూపనామములను తీర్చిదిద్దునదే విద్య. దివ్యమానసతత్వాన్ని గుర్తించినప్పుడే ప్రపంచమునకు, సంఘమునకు, తనలో వుండిన సమస్త శక్తులకు సన్నిహిత సంబంధమైన బాంధవ్యము ఏర్పడుతుంది. యావత్ మానవజాతి ఒక్క కుటుంబముగా నిరూపింపజేయునదే దివ్యమైన విద్య. సమాజములోని సమస్త శక్తులను ఏకీభవించి ఐకమత్యముతో అనుభవింపజేయునదే విద్య.

**ఐకమత్యముచేత మానవుడు సాధించలేనిది ఏదీ లేదు**

ఈనాటి విద్యావిధానమును మనము సరైన స్థితిలో అనుభవించుటకు అవకాశములు లేకపోవుచున్నవి. లోకములో అనేకమంది మేధావులు వున్నారు. వైజ్ఞానికులు కలరు. కాని యిట్టి మేధావులను, వైజ్ఞానికులను సక్రమమైన మార్గమును అనుసరింపచేసే సరైన విద్యలేకపోవటముచేతనే ఈ మేధాశక్తి, విజ్ఞానము పెడమార్గము పట్టి జగత్తులో అనేక విధములైన అశాంతులకు గురిచేస్తున్నవి. ఈనాటి విద్యావిధానము ఇంద్రియములను తృప్తిపరచే నిమిత్తమే విద్యయని అదియే పరమ లక్ష్యమని భావిస్తూ వున్నది. ఈనాటి విద్య కేవలము తెలివితేటలను మాత్రమే పెంచుచున్నదిగానీ గుణములను ఏమాత్రముకూడను అభివృద్ధి చేయటం లేదు. ఇట్టి విద్యావిధానమును సంస్కరింపజేసే నిమిత్తమై మన భారతదేశములో నాయకులు అనేక విధములైన ప్రయత్నములు సలుపుతూ వచ్చారు. ఎన్నియో కమిటీలను నియమించినారు. కానీ, యివన్నీ కూడను come for tea వరకేగాని విద్యావిధానమును సరైన మార్గములో తీర్చిదిద్దటానికి ఎవ్వరూకూడను గట్టి సంకల్పము చేయడంలేదు. కావలసినన్ని ప్లానులు వేసినారుగాని వాటిని ఆచరణలో నిరూపించలేదు. భారతీయులు అనేక కష్టములకు,

నష్టములకు, దుఃఖములకు ఓర్చి స్వరాజ్యమును మాత్రమే సాధించగలిగిరి గానీ ఐకమత్యమును సాధించలేకపోయారు. ఐకమత్యము లేకపోటమే యిన్ని దురవస్థలకు మూలకారణము. ఐకమత్యమే జీవితముయొక్క పరమధర్మము. ఇట్టి ఐకమత్యము చేత మానవుడు సాధించలేనిది జగత్తులో ఏమియు లేదు. అట్టి జీవితమునకు మూలాధారమైన ఐకమత్యమును విస్మరించి కేవలము తాత్కాలికమైన స్వరాజ్యమును ఆశించటముచేతనే భారతదేశము యిన్ని కష్టములకు, నష్టములకు, దుఃఖములకు గురికావలసి వచ్చింది. అందువలన విద్యావిధానములో కావలసినన్ని మార్పులు చేయాల్సిన అవసరం ఎంతో ఉన్నది.

**ఆధునిక విద్యవలన విజ్ఞానము పెరిగినది కాని, వివేకము పెరగలేదు**

ఈ విద్యావిధానమునకు తగిన వివేక, విజ్ఞానములుకూడను అభివృద్ధి పరచాలి. కానీ, దురదృష్టవశాత్తు విజ్ఞానము పెరిగినదిగాని, దానికి తగిన వివేకము పెరగలేదు. వినయము లేని విజ్ఞానము కేవలము నిరుపయోగము. విద్యలో వినయము ప్రధానమైన ప్రాణము. ఇలాంటి ప్రాణసమానమైన వినయమును మనము కోల్పోయినాము. దేశముయొక్క భవిష్యత్తును ఏమాత్రము లక్ష్యమునందు వుంచుకొనుట లేదు. కనుకనే మానవునియందు సుజ్ఞాన, ప్రజ్ఞానములనేవి శూన్యమైపోయినవి. యీనాటి భారతీయులు విద్య విరివిగా పెరిగినదని; ప్రతి పల్లెయందు విద్యాసంస్థలు స్థాపింపబడినవని; విద్య చాలా అభివృద్ధిలో నున్నదని భావిస్తున్నారు. పాపం, వెఱ్ఱివారు! కేవలము విద్యాసంస్థలు పెరిగినంత మాత్రమున విద్య పెరిగినదని భావించుకోటము వెఱ్ఱితనమే! కోట్లకు ఖర్చుపెడుతున్నారు; కానీ సరియైన విద్యావిధానమును గుర్తించుకొనలేక కేవలము విద్యాసంస్థలను సంఖ్యాపరంగా అభివృద్ధిపరుస్తున్నారు. దీని యొక్క ప్రోగ్రెస్సు ఏమిటి అని మనము చక్కగా లోతుకు దిగి విచారించిన

**మేలు చేసినవానికే కీడుసేయు**
**కూడు బెట్టిన దాతనే కూలద్రోయు**
**విద్యచెప్పిన గురువునే వెక్కిరించు**
**ఇదియె ప్రోగ్రెస్సు యీనాటి విద్యయందు**

సంఘ సంస్కార మంతయు గంగకలసె
మనుజజాతికి తృప్తియే మాయమయ్యె
శీలనీతులు జగతిలో క్షీణమయ్యె
ఇదియె ప్రోగ్రెస్సు ఈనాటి విద్యయందు

భవ్యభావాలు ఎరిగిన భారతీయ
సంఘ సంస్కృతి గుర్తింప నేర్వరైరి
భారతీయులు యత్నింపనేరకున్న
ఇంతకంటెను దురదృష్టమేమి కలదు?

శరీరము, మనస్సు, ఆత్మలమధ్య వుండిన సంబంధమును గుర్తించటమే సంస్కృతి. మహోన్నత సంస్కృతి, చరిత్ర కలిగిన భారతదేశము ఈనాడు ఆ సంస్కృతియొక్క విశిష్టతను గుర్తించటానికి ప్రయత్నించటము లేదు. భారతీయులే దీనిని ఆచరణ యందు పెట్టుటకు ప్రయత్నించుట లేదు. అసలు 'సంస్కృతి' అంటే ఏమిటో ఈనాటి విద్యార్థులకు అర్థము కాదు. 'దివ్యమైన మానవత్వాన్ని పరిపూర్ణత్వము గావించేదే సంస్కృతి', అనే సత్యాన్ని విస్మరించిపోతున్నారు. శరీరము, మనస్సుల ఆధ్యాత్మిక తత్త్వాన్ని అర్థము చేసుకోటానికి తగిన ప్రయత్నము చేయటం లేదు. నిత్య జీవితములో సమగ్రతాభావాన్ని సాధించేదే సంస్కృతి. శరీరమునకు, మనస్సునకు, ఆత్మకు వుండిన సరైన సంబంధ బాంధవ్యాన్ని గుర్తించి ఏకత్వమును భావించటమే సంస్కృతి. మానవత్వాన్ని పరిపూర్ణమైన భావముతో అనుభవింపజేయునదే సంస్కృతి. జాతి, మత, భేదములకు ఏమాత్రము లొంగక ఏకత్వమైన దైవత్వమునే గుర్తింపచేయునది సంస్కృతి. అనేకత్వములోని ఏకత్వమును నిరూపింప చేయునదే సంస్కృతి. ఇట్టి పవిత్రమైన సంస్కృతిని ఎంతవరకు వల్లించినప్పటికిని తనివి తీరదు. అట్టి దివ్యమైన, భవ్యమైన భారతీయ సంస్కృతిని ఈనాడు విద్యార్థులు ఏమాత్రము గుర్తించుటకు ప్రయత్నించుటలేదు. భారతీయ సంస్కృతి కేవలము భారతీయులకు మాత్రమే కాకుండా యావత్ప్రపంచమునకు నాయకత్వాన్ని, దివ్యమైన మార్గాన్ని నిరూపింప జేయునది అనే సత్యాన్ని మనము గుర్తించాలి.

పల్లె ప్రజలయందున్న పవిత్ర భావములు పట్టణములలో నివసించే విద్యావంతులయందు

srisathyasaivachanamrutam

ఏ మాత్రము కనిపించుటలేదు. పాపభీతి, దైవప్రీతిని పెంపొందించి, మానవుని సంస్కరింపజేయునదే సంస్కృతి.

**పాపభీతి లేని పామరత్వము బట్టి**
**దైవప్రీతి లేని దారిబట్టి**
**మానవత్వమణగె మానవులందున**
**ఇంతకన్నను దౌర్భాగ్యమేమి కలదు**

ఈనాడు ఎట్టి చదువులు ఎరగనట్టి పల్లెజనులయందున్న పవిత్రమైన భావములు చదువుకున్న, పట్టణములయందున్న విద్యావంతులయందు ఏమాత్రము కనిపించటము లేదు. కొండజాతివారు, కోయజాతివారికి వుండిన నీతి నియమములుకూడను ఈనాటి విద్యావంతులలో కనిపించటంలేదు. ఎక్కడ విద్యాసంస్థలు, ఎక్కడ విశ్వవిద్యాలయములు, ఎక్కడ కోర్టులు, కచ్చేరీలు అధికముగా పెరిగినవో అక్కడే అన్యాయములు, అక్రమములు, అనాచారములు అధికమైపోతున్నాయి. ఈ కోర్టు, కచ్చేరీలు, విద్యాసంస్థలు లేని పల్లె ప్రజలయందే నీతి, నిజాయితీలు యింతో అంతో ప్రకాశిస్తున్నాయి. కనుక, ఈ విద్యాభివృద్ధివల్ల కలిగిన ఫలితము ఏమిటి? మానవత్వాన్నే మరచి కేవలము పశుత్వాన్ని పెంచుకుంటున్నాము. స్వేచ్ఛా విహారాన్ని ఆశిస్తున్నాము. ఇంద్రియ భోగములకై పాటుపడుతున్నాము. మానసిక శాంతికి నోచుకోలేక అతిదూరమైపోతున్నాము. శాంతి, భద్రతలతో కళకళలాడుతూ వుండవలసిన విద్యాసంస్థలు ఈనాడు భయభ్రాంతులతో కుళ్ళి, కుమిలి, కూలిపోతున్నవి. విద్యయొక్క విశిష్టత ఏమిటి? మనము నేర్చిన విద్యను సమాజములో సమన్వయము గావించుకొని సక్రమమైన మార్గములో ఆదర్శవంతమైన జీవితాన్ని గడపటమే విద్యయొక్క పరమ లక్షణం.

**విజ్ఞాన, సాంకేతిక శాస్త్రములు మానవునికి సుఖముకంటె దుఃఖమునే ఎక్కువగా అందిస్తున్నవి**

ఈనాడు Science and Technology కావలసినంత పెరిగిపోతున్నాది. విద్యావిధానములోపల వైజ్ఞానిక శాస్త్రము విశేషముగా అభివృద్ధి చెందుతున్నది. దీనివలన సమాజములో శాస్త్ర పరిజ్ఞానము బాగా అభివృద్ధి గాంచినది నిజమే! కానీ, ఈ విధమైన పరిజ్ఞానము మనకు చేసిన మేలుకంటె కీడునే అధికముగా కనిపిస్తున్నాది. ఈ సాంకేతిక,

srisathyasaivahini.org / srisathyasaivachanamrutam

విజ్ఞాన శాస్త్రము మానవునకు అందించే సుఖము కంటె దుఃఖమే అధికముగా వుంటున్నాది. మానవ జీవితములో శాంతిభద్రతలు అనుభవించటానికి ఏమాత్రము అవకాశము లేకుండాపోతోంది. ఈనాడు వీడియోలు, రేడియోలు అధికమైపోయినవి. సినీమాలు, విమానాలు అధికమైపోయినవి. టెలివిజన్లు, అనేక విజన్లు అధికమైపోయాయి. కానీ Divine vision మాత్రము కనిపించటం లేదు. దీనివల్ల మానవునియొక్క నిత్యజీవితము మరింత భారము అయిపోయింది. నేడు మానవ జీవితము చాలా వ్యయముతో కూడి వుంటున్నది. ఈ సాంకేతిక విజ్ఞాన శాస్త్రము మానవుని మనశ్శాంతికి దూరము చేస్తున్నది. మానవుని దేహ పరిస్థితికూడను దినదినమునకు క్షీణించి బలహీనత గావించుచున్నది. నీతి, నిజాయితీలను నేలమట్టము గావించుచున్నది. ఏ విధముగా? ఈనాడు కొన్ని సమాజములలో ప్రబలియున్న దుష్ప్రభావములను చూస్తూంటే ఈ యొక్క అవినీతికి శాస్త్ర విజ్ఞానము మూలకారణమనేది స్పష్టముగా తెలియుచున్నది. టి.విలు, వీడియోలు, రేడియోలు యివి అందరి యిండ్లయందును వుండియే తీరాలి. ఈ పరికరాలు లేని యిల్లు కేవలము అనాగరికముగా పరిగణింపబడుతున్నది. ఈనాడు మధ్యతరగతిలో జీవించే అధికారియొక్క స్థితి ఎటువంటిదని మనము విచారిస్తే ఈ పరిస్థితులవల్ల తనయొక్క జీవితము చాలా అశాంతికి గురైపోవుచున్నది. అతనికి వచ్చే కొద్దిపాటి జీతముతో తాను టి.వి., వీడియో, రేడియోలు ఎలా ఖరీదు చేయగలడు? లేకపోతే ఆ యింటిలోనున్న ఆలుబిడ్డలు అనేక విధముల బాధలు పడతారు. అందువలన ఆలుబిడ్డలను సంతోషపరచే నిమిత్తమై వీటన్నిటిని కొనవలసివస్తోంది. చేతిలో తగినంత డబ్బు వుండదు. ఫలితంగా లంచాలు తీసుకోవడం ప్రారంభిస్తున్నారు. ఈ విధముగా క్రింది ఉద్యోగి మొదలు, పై అధికారివరకు తమ యింటిలోనివారిని సంతృప్తిపరచేకోసమని, పిల్లలను ఆనందపరచేనిమిత్తమై అనేక విధములైన వస్తువాహనాదులు సేకరించటంకొరకు లంచాలు ప్రారంభిస్తున్నారు. ఇక, పిల్లలకు చదువులు చెప్పించాలంటే మరింత కష్టమై పోతుంది. పిల్లవానిని ఒకటవ తరగతిలో చేర్చడానికి ప్రైమరీస్కూలుకు ఐదువేలో, పదివేలో డొనేషను కట్టాలి. వాడు నేర్చుకునే చదువుకంటె వానియొక్క Uniform dress కు మరింత ఖర్చు అవుతుంది. Donation, Uniform లేకుండా పోతే స్కూలులో పిల్లలను చేర్చుకోరు. ఈ మధ్య తరగతి ఆఫీసరు వీటన్నిటికి సరిపడ ధనమును ఎక్కడనుంచి తెస్తాడు? కనుక, వీరు

పెడమార్గమును పట్టటానికి ప్రయత్నిస్తున్నారు. ఈ విధముగా విజ్ఞానశాస్త్రమనేది మానవుని నిత్యజీవితములోపల గొప్ప అశాంతిని కలిగింపజేస్తున్నది.

**ఆధునిక మానవుని జీవితము అహంకార, ఆడంబరములతో, అత్యంత వ్యయ, ప్రయాసలతో భారమైంది**

యింటిలో ఎన్ని విధములైన బాధలు వుండినప్పటికిని, పరిస్థితులయొక్క ప్రభావమునకు గురియైనప్పటికిని, తినటానికి వుండటానికి అతి కష్టముగా వుండినప్పటికిని, బయట మాత్రము ఆడంబరము మితిమీరిపోతున్నాది. ఈ ఆడంబరము, అహంకారములచేత మానవుని జీవితము అతి వ్యయముతో కూడి వుంటున్నది. ఈనాటి డాక్టర్సు అనుకోండి, లాయర్సు అనుకోండి, ఎవరైనా కాని విద్యావంతులందరూ తాము బయట తిరగాలంటే ఏదో ఒక వాహనము కావాలి. ఇంటిలో ఎన్ని విధములైన అనానుకూలములు వుండినప్పటికిని బయట మాత్రము కార్లోనో మోటరుసైకిలుపైనో తాను సంచారము చెయ్యాలి. ఈ విధమైన ఆడంబరమే చేయకపోతే డాక్టర్సు దగ్గరకు పేషెంట్లు రారు, లాయర్ల దగ్గరకు క్లయింట్సు రారు. ఇవి నిత్య జీవితములో ఎదురవుతున్న ప్రధాన సమస్యలు. ఈ సమస్యలనుండి బయటపడే నిమిత్తమై అవినీతికి పాల్పడుతున్నారు. ఏతావాతా ఈ అవినీతికి కారణము Science బాగా అభివృద్ధి చెందడమే! అయితే, మౌలికంగా Science చెడ్డది కాదు. దానిని వినియోగించుకునే విధానములో వుంటుండాది, దోషము. కనుక, ఆ వినియోగించుకునే విధానము తెలుసుకోవడానికి విద్య అవసరము. విద్య అనగా పరిపూర్ణమైన ఆత్మజ్ఞానమని చెప్పవచ్చును. ఇలాంటి విద్యను నేర్చవలసిన విద్యార్థులు ఈ ఆధునిక విద్యలో పడి అనేక కష్టములకు గురౌతున్నారు. ఆవగింజంత ఆధునిక విద్యను నేరిస్తే గుమ్మడికాయంత అహంకారము బయలుదేరుతుంది. ఇలాంటి విద్యావంతులకే భారతీయ సంస్కృతిపైన విసుగు పుడుతున్నాది. ఇది సరియైన విద్య కానేరదు. నిజమైన విద్యను గుర్తించటానికి మనము ప్రయత్నించాలి.

**ఈనాటి విద్యా ప్రభావమువలన జ్ఞానము ఎంత పెరుగుతున్నదో, అజ్ఞానము కూడ అంతకంత పెరుగుతున్నది**

విద్య కేవలము ఉద్యోగముకొరకేనన్న భావమును మనము దూరము చెయ్యాలి.

sri sathyasai vahamrutam

సమాజములో మనము గౌరవముగా, న్యాయముగా జీవించటానికి విద్యయని విశ్వసించాలి. సమాజములో గౌరవము కోల్పోయిన తరువాత మనను విద్యలు కాపాడేది యేమిటి? మానవునియొక్క నీతి, నిజాయితీలు పోషించటానికి తగిన కృషి చెయ్యాలి, విద్యద్వారా. కృతజ్ఞతా పూర్వకమైన జీవితాన్ని ఇక అభివృద్ధి చేసుకోవాలి. కానీ, ఈనాడు అట్టి కృతజ్ఞత ఎక్కడకూడను కనిపించటము లేదు. కన్న తల్లితండ్రులనుకూడను గౌరవించటానికి వెనుకంజ వేస్తున్నాడు, నేటి విద్యావంతుడు. తన blood, తన head, తన food, ఇవన్నీ parents gift అనే సత్యాన్ని మరచిపోతున్నాడు. ఇట్టి విద్యను కేవలం అవిద్య అనే చెప్పవచ్చుగాని విద్య అని చెప్పటానికి వీలులేదు. ఈనాడు జ్ఞానము ఎంత పెరుగుతున్నదో దానితోబాటు అజ్ఞానముకూడను అంతకంతకు నీడవలె వెంటాడుతూ వస్తున్నాది.

**భారతీయ సంస్కృతి నిల్చినంతకాలమే భారతదేశము సుక్షేమంగా ఉంటుంది**

విద్యార్థులారా! మీరు విద్యాభ్యాసము చేయవలెనంటే కేవలము దేశము నిమిత్తమై మీరు విద్యనభ్యసించండిగాని మీ స్వార్థనిమిత్తమై విద్యనభ్యసించకండి. మన భారతదేశముయొక్క సంస్కృతి శాశ్వతముగా నిల్వాలనుకుంటే మీరు పవిత్రమైన మన సంస్కృతిని అర్థము చేసుకోండి. భారతీయ సంస్కృతి వుండినంత కాలమే భారతదేశము సుక్షేమముగా వుంటుంది. ఈ పవిత్రమైన సంస్కృతిని మనము ఏనాడు కోల్పోతామో అప్పుడు భారతదేశమే మనకు ఉండదు. ఇట్టి దివ్యమైన సంస్కృతిని మీయొక్క దేహమునందు ఒక రక్తసమానముగా మీరు విశ్వసించాలి. దీనిని ప్రధానంగా భారతీయులు పోషించటం చేతనే దీనికి Indian culture అని పేరు వచ్చింది. అయితే, యిది ప్రపంచమునకే ఆదర్శ ప్రాయమైన సంస్కృతి. ఈనాడు మానవుడు కనిపించుచున్నాడేగాని, మానవత కనిపించటం లేదు. మానవజాతి ఉండి ఏమి ప్రయోజనము? ఈనాడు కేవలము రూపమునందు మాత్రమే మానవుడుగా నిరూపిస్తున్నాడు. ప్రాణసమానమైన మానవత్వము మరియు మానవతా విలువలు కోల్పోవటంచేత జగత్తునందు ఇన్నివిధములైన అల్లకల్లోలములు అభివృద్ధి అయిపోయినవి. మనము సమాజమును విసర్జించటానికి వీలుకాదు. సమాజమునందే నివసిస్తూ సమాజాన్ని మనము పోషించాలి.

**సమాజ సంక్షేమమే విద్యయొక్క లక్ష్యము కావాలి**

sri sathyasai vahinamrutam

## తేదీ. 22-11-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము

ఈనాటి విద్యాసంస్థలన్నీ కేవలము పట్టములందించే కర్మాగారములుగా మారిపోయాయి. యిది కాదు, విద్యాసంస్థలయొక్క లక్షణము. విద్యయందు వివేకమును, వివేకమునందు విజ్ఞతను కొంతవరకు అనుభవించి తద్వారా సమాజములో సమన్వయము గావించే స్థితిని మనము సంపాయించాలి. విద్యను కేవలము ఒక పట్టమునందుకొనే నిమిత్తమై వినియోగించరాదు. ఏదో ఒక పుస్తకము కంఠస్థము గావించినంతమాత్రమున మనము విద్యావంతులము కాము. జీవితమంతయు ఆదర్శవంతమైన రీతిగా సమాజములో మనము సేవచేయ్యాలి. సమాజమే మన యొక్క ప్రాణము. సమాజమునకు క్షణమైన మనము దూరముగా జీవించలేము. ఈనాడు తాను, తన కుటుంబము క్షేమంగా వుండాలని స్వార్థ స్వప్రయోజనములతో పాటుపడుతున్నారేగాని విద్యావంతులు సమాజక్షేమమును ఏమాత్రము దృష్టిలో పెట్టుకోవడం లేదు. ప్రాచీన కాలమునందు విద్యకు ఎంతయో విలువనిచ్చేవారు. ఆనాటి విద్యార్థులు Simple life అనగా సహజమైన జీవితమును అనుభవించేవారు. ఈనాటి ఆడంబరాలు ఆనాడు లేవు. వారి దుస్తులుగాని, వారి ప్రవర్తనలుగాని చాలా గౌరవమైన రీతిగా ఉండేవి. వారి నడతలు, వారి చర్యలు యెంతయో గౌరవముగా వుండేవి. ఈనాటి విద్యావంతులయందుగాని లేక విద్యాధికారులయందుగాని ఈ వినయ విధేయతలు ఏమాత్రము కనిపించవు. Manners అంటే ఏమిటో వారికి అర్థము కాదు. Behaviour అంటే ఏమిటో వారికి అర్థము కాదు. Discipline అంటే అసలే అర్థము కాదు. మానవ జీవితానికి ప్రాణాధారమైన వీటినే అర్థము చేసుకొనలేకపోయిన, మన విద్యయొక్క విలువయేమిటి? కనుక, సమాజములోపల గౌరవముగా బ్రతికి సమాజమును సరైన రీతిగా తీర్చిదిద్దే వ్యక్తులుగా మనము రూపొందాలి. ప్రకృతిని పరిపాలన చేసే దక్షులుగా తయారుకావలసిన విద్యావంతులు ఈనాడు ప్రకృతికి వశమైపోయి దాసులుగా జీవిస్తున్నారు.

**ఈనాడు విద్యార్థుల సంఖ్య పెరిగేకొలది విద్యా విధానములో విలువలు తరుగుతూ వస్తున్నాయి**

'సత్యంవద,' 'ధర్మంచర' ఈ రెండు సూక్తులను మీరు సరైన రీతిలో అర్థము చేసుకోటంలేదు. 'త్రికాలాభాద్యం సత్యం' అన్నారు. సత్యము భూతభవిష్యద్వర్తమానములను సమన్వయము

sri sathyasai vachanamrutam

గావించునది. ఇట్టి సత్యాన్ని ఈనాడు విస్మరించినారు. ధర్మమంటే తమ ఇష్టానుసారము ప్రవర్తించటమేనని భావిస్తున్నారు. ఆనాటి గురుకులములో విద్యాభ్యాసము పూర్తి చేసుకొని గృహస్థాశ్రమములో చేరటానికి వెళ్ళేటప్పుడు గురువులు వారిని చెంతచేర్చి శ్రేయో మార్గమును, ప్రేయోమార్గమును బోధించి ఆ పిల్లలను వదలలేక వదలలేక కంటిధారలతో యింటికి పంపేవారు. గురువులకు, శిష్యులకు అంతటి సన్నిహిత సంబంధము వుండేది. కానీ, ఈనాటి గురువులకు అట్టి వాత్సల్య భావముగాని, శిష్యులకు గురుభావముగాని, పితృభావముగాని కనిపించటంలేదు. కనుకనే ఈనాడు విద్యాసంస్థలంతా 'పిల్లలు ఎప్పుడెప్పుడు బయటకు పోతారా' అని ఆలోచిస్తూ వుంటారు. ఈనాడు విద్యార్థులకు భయము ఏమాత్రము లేదు. ఇలాంటి విద్యార్థులకు సరైన విద్య ఏరీతిగా చేకూరుతుంది? హితమును బోధించటమే గురువుయొక్క ప్రధాన కర్తవ్యము. గురువును సేవించి గురువుయొక్క ఆజ్ఞను శిరసావహించటమే శిష్యుని ప్రధానలక్ష్యము. ఈనాడు ఈ రెండు కూడను ఏ మాత్రము కనిపించటం లేదు. ఆనాటి విద్యార్థుల సంఖ్య చాలా తక్కువగా వుండేది. విద్యావిధానము చాలా ఘనముగా వుండేది. ఈనాడు విద్యార్థుల సంఖ్య పెరిగే కొలది విద్యావిధానములో విలువలు తరుగుతూ వస్తుండాయి. ఈ విధముగా గుణము తరగటము సహజమే! 'మనుష్యులు ఎక్కువయ్యేకొద్దీ మజ్జిగ పలచనౌతుంది' అంటారు. ఈనాడు విద్యావిధానము చాలా తక్కువ స్థాయిలో వుంటున్నాది. ఆనాటి విద్యార్థులు ఒక్కొక్క క్లాసులో ఐదుమంది లేక ఆరుమంది. ఈనాటి విద్యావిధానములో ఒక్కొక్క క్లాసుకు మూడు నాలుగు సెక్షన్లు పెడుతున్నారు. ఒక్కొక్క సెక్షనులో అరవైమంది, ఎనభైమందిని చేరుస్తున్నారు. ఈ విధమైన విద్యవలన జగత్తుకు ఏమి మేలు జరుగుతుందని ప్రభుత్వముకూడను గుర్తించటానికి ప్రయత్నించటములేదు. ఏదో వచ్చిన వారినందరిని చేర్చుకోమని ఆర్డర్సు వేస్తూ వుంటారు. ఇందులో చదివేవారు ఎంతమంది, చదవనివారు ఎంతమంది తేలటానికే లేదు. ఈ విద్యావిధానములో ప్రభుత్వము సరైన శ్రద్ధను వహించటములేదు. పాపము, వారికికూడను సమయము చిక్కటము లేదు. వారి స్థానాన్ని నిలబెట్టుకోటానికి పోరాడటమే సరిపోతున్నది, కాలము. ఈనాడు విద్యావిధానములోపల విశేషమైన మార్పు రావాలి. సరైన విద్యను అభ్యసింప చేయటానికి ప్రయత్నించాలి. అటువంటి విద్యవల్లనే దేశము బాగుపడుతుందిగాని యిట్లా దినదినానికి విద్యయొక్క స్థాయి తరిగిపోతుంటే

యింక దేశముయొక్క భవిష్యత్తు వూహించటానికి వీలులేని స్థితిలో ఉంటుంది.

విద్యార్థులారా! మీరు మీ తల్లితండ్రులను మొట్టమొదట గౌరవించండి. సమాజములో ప్రవేశించి సేవలలోపల శ్రద్ధ వహించండి. దేశమే మన దేహముగా భావించాలి. దేశనిమిత్తమై విద్యనభ్యసించినట్లుగా నీవు వూహించాలి. నీ శరీర, మనస్సు, ఆధ్యాత్మిక శక్తులన్నియు కూడను దేశమునకే ధారపొయ్యాలి. దేశభక్తి లేని జీవితము వ్యర్థము

**ఇది నాదు మాతృదేశము**
**ఇది నా ప్రియ మాతృభాష ఇది నామతమంచు**
**యెదగొట్టి నుడువనేరని**
**బ్రతికిన జీవి యొకండీ వసుధను గలదా?**

దేశాభిమానము వుండాలి. సమాజములో సరైన గౌరవమర్యాదలు సంపాదించుకోవాలి. తల్లితండ్రుల ప్రేమకు పాత్రులు కావాలి. తల్లితండ్రుల ప్రేమకు నోచుకోలేని దురదృష్టవంతుడు దేశమునకు ఏ విధముగా సేవ చేయగలడు? యిలాంటి కొన్ని ఆదర్శమైన విద్యా సంస్థలు అభివృద్ధియైనప్పుడు దేశములో యెంతైనను శాంతి, భద్రతలు చేకూర్చవచ్చు.

**ఆధ్యాత్మిక విద్య లేకపోతే మానవత్వము రాణించదు**

ప్రేమస్వరూపులారా! విద్యయొక్క విషయాన్ని చక్కగా గుర్తించండి. కేవలము చదువు నేర్చినంత మాత్రమున విద్యావంతులు కారు.

**చదివి వ్రాయనేర్చినవారంతా విద్యార్థులేనా?**
**కాలేజీ డిగ్రీలు పొంద విద్యావంతుడగునా?**
**సుజ్ఞానము సుకృతము లేని విద్యలు సద్విద్యలగునా?**
**బ్రతుకుటకే విద్యయన్న బ్రతుకలేవె పశుపక్షులు?**

కనుక, బ్రతుకుకోసము కాదు, మన విద్య. ఈ సత్యాన్ని మీరు గుర్తించండి. చదవనేర్చినంత మాత్రమున విద్యావంతులు కాదు. వ్రాయవచ్చు, చదవవచ్చు. ఇది విద్యకు సంబంధము



srisathyasai vachanamrutam

కాదు. ఇది కేవలము అభ్యాసముతో చేకూరినది. విద్య హృదయముతో చేరాలి. హృదయమువరకు పోనటువంటి విద్య, విద్య అవుతుందా? హృదయముతోకూడిన దానిని మనము ఆచరణలో పెట్టినప్పుడు ఇదే ఆత్మవిద్య అన్నారు. ఈ ఆత్మవిద్యే ఆధ్యాత్మిక విద్య. 'విద్యానాం ఆధ్యాత్మిక విద్య.' లౌకికమైన విద్యలన్నియు చిన్న చిన్న కాలువల వంటివి. ఫిజిక్సు, కెమిస్ట్రీ, మేథమెటిక్సు, జువాలాజీ, యివన్నీ చిన్న చిన్న పిల్ల కాలువలు. ఆధ్యాత్మిక విద్య సముద్రము వంటిది. ఈ సర్వవిద్యలు ఆ సముద్రములో చేరిపోవలసిందే! 'నదీనాం సాగరోగతిః.' కనుక, ఈ సర్వవిద్యలతోబాటు ఆధ్యాత్మిక విద్యనుకూడను అభ్యసించటం అత్యవసరము.

ఆధ్యాత్మిక విద్య లేకపోతే మానవత్వమే రాణించదు. విద్యార్థులకు ఆత్మ విశ్వాసము అత్యవసరము. మనము దేనికో ఏడుస్తున్నాము. దేన్ని మనం సాధించాలో దానినిమిత్తము మాత్రం మనం ఏడ్వటం లేదు

**పుట్టినప్పుడు ఏడ్చినారు చచ్చినప్పుడు ఏడ్చినారు**
**మధ్య మధ్య ఎన్నెన్నో విషయాలకు ఏడ్చినారు**
**ధర్మగ్లాని కలుగుచుండ వుద్ధరింప ఏడ్చినారా**
**దేనికోసం ఏడ్చినారు ఏడ్పుకోసం ఏడ్చినారా**

ఇవేనా మీ ఏడ్పులు? తుచ్ఛమైన, అనిత్యమైన విషయ భోగములకై మీరు ఏడుస్తున్నారు. కానీ నిత్య, సత్య, ఆత్మభావమునకై యేడ్చే వ్యక్తి ఒక్కడైనా కనిపించటము లేదు. ఈ విద్యను నేర్చినంత మాత్రమున మన హృదయము వికసించదు.

**పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?**
**తనువును తా దండించిన విషయ భోగములడంగునా?**
**ఆకలి దప్పులు మానినంత ఆత్మజ్ఞాని తానగునా?**
**తానెవరో తెలియకున్న తత్వజ్ఞాన మెట్లు కుదురు?**

నీవు ఎవరో తెలుసుకోటానికి ప్రయత్నించటం లేదు. ప్రపంచములో జరిగే అన్ని న్యూసులు కనుక్కోటానికి ప్రయత్నిస్తున్నావు. ఇన్ని న్యూసులు విని నీ నుంచి వచ్చే న్యూసెన్సు తెలుసుకోకపోతే ఏమి ప్రయోజనము? కనుకనే నీవు Useless అయిపోతున్నావు.



sri sathyasai vachanamrutam

## నిన్ను నీవు తెలుసుకునేటట్లు చేసేదే విద్య

మొట్టమొదట నిన్ను నీవు తెలుసుకునేటట్లు చేసేదే విద్య. ఇట్టి విద్యను మనము అభ్యసించాలి. 'నేను మానవుడను, మానవుడను', అని మానవాకారము ధరించినంత మాత్రమున మానవుడు కానేరడు

**ఆకుపచ్చ పక్షులన్ని చిలుకలవలె పలుకునా**
**పువ్వులపై పారాడెడు పురుగులు తుమ్మెదలగునా**
**పులి చర్మము కప్పిన గాడిద తా పులియగునా**
**ఏనుగంత బలిసియున్న పంది ఏనుగగునటయ్యా**

మనము మానవుల మనుకున్నందుకు, మానవాకారము ధరించినందుకు మానవత్వాన్ని వరించాలి, పోషించుకోవాలి. కనుక, మానవతా విలువలు పెంచుకోటానికి విద్యార్థులు ముందంజ వేయండి. ఈ యుక్తులతో, కుయుక్తులతో మీరు కేవలము మత్తులు కావద్దండి. మీ యొక్క భావములు విశాలము గావించుకోండి. హృదయమును దివ్యమైన భావములతో నింపుకోవాలి. యావత్ ప్రపంచము తనయొక్క గృహముగా భావించుకోవాలి. అప్పుడే unity in diversity అనగా అనేకత్వములోని ఏకత్వాన్ని నీవు దర్శించగలవు.

విద్యార్థులారా! తల్లితండ్రులను గౌరవించి, గురువులను ప్రేమించి, దైవాన్ని విశ్వసించి అనేక విధములుగా మీ యొక్క జీవితాన్ని సమాజసేవకు అర్పితము గావించుకున్నప్పుడే సరైన విద్య. ఇదే 'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథిదేవోభవ.' సర్వమానవులయందు వుండిన దైవత్వాన్ని మీరు గుర్తించండి. మిమ్మల్ని మీరు గౌరవించుకోటానికి పూనుకుంటారు. మీ జీవితము దివ్యమైన ఆనందముతో వర్ధిల్లుతుంది.

Happy happy, be happy
Happy happy make others happy
All will be happy God will be happy

**(తేదీ. 22-11-1988న భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam